
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

నల్లగొండ
7
శనివారం 11 మే 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.162	235	267
సూర్యాపేట	రూ.165	240	270
నల్లగొండ	రూ.158	236	278

ఉష్ణోగ్రత గరిష్ఠం 39.0 । కనిష్ఠం 25.0


సభలో మాట్లాడుతున్న ఖర్గే, చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి వెంకట్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు

బీజేపీని పారదోలి

దేశాన్ని రక్షించాలి

- ఆ పార్టీకి బీఆర్‌ఎస్ పరోక్ష సహకారం
- రాజ్యాంగం, రిజర్వేషన్ల రక్షణ కోసం కాంగ్రెస్‌ను గెలిపించాలి
- నకిరేకల్ జనసభలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే

నల్లగొండ, మే 10 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): 'దేశంలో దళిత, ఆదివాసీలు, బీసీలు, ఆర్థికంగా వెనుకబడినవర్గాలకు అండగా ఉన్న రాజ్యాంగాన్ని, రాజ్యాంగం ద్వారా ప్రాప్తించిన రిజర్వేషన్లను తొలగించాలని కుట్రపన్నిన బీజేపీని ఈ ఎన్నికల్లో పారదోలండి.. రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను కాపాడేందుకు పోరాడుతున్న కాంగ్రెస్‌ను ఆశీర్వదించండి' అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కోరారు. శుక్రవారం భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని నకిరేకల్‌లో ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్ రెడ్డి తరపున నిర్వహించిన జనసభలో ఆయన మాట్లాడారు. తెలంగాణకు ప్రధాని మోదీ ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. పదేళ్ల బీజేపీ పాలనలో తెలంగాణకు చేసిందేమీ లేకపోగా, నెహ్రూ, ఇందిర హయాంలో స్థాపించిన ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. ఖాజీపేట రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ, ఐటీఐఆర్ ప్రాజెక్టుపై మోదీ ఇచ్చిన హామీలు ఎంతవరకు వచ్చాయో ప్రజలకు తెలుసని, అబద్ధాలతోనే వారు కాలం గడుపుతున్నారని దుయ్యబట్టారు. దళిత, ఆదివాసీ, బీసీల రిజర్వేషన్లను రద్దు చేస్తామని బీజేపీ చెబుతున్నా బీఆర్ఎస్ గానీ, కేసీఆర్ గానీ ఎందుకు నిలదీయడం లేదో ప్రజలకు అర్థమవుతోందన్నారు. ఆ రెండు పార్టీలు పరోక్షంగా సహకరించుకుంటున్నాయని ఆరోపించారు. దేశంలో పేద, బడుగు, బలహీనవర్గాలకు అండగా ఉన్న రాజ్యాంగాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ చివరి రక్తపుబొట్టు వరకు పోరాడుతుందన్నారు. రాజ్యాంగం, రిజర్వేషన్లు రక్షించాలంటే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ను గెలిపించాలని విన్నవించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారెంటీలు అమలు చేసిందన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అందుతోందని, రూ.500కే సబ్సిడీ గ్యాస్ సిలిండర్ వస్తోందని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని తెలిపారు. పంద్రాగస్టు నాటికి రైతులకు రుణమాఫీ వర్తిస్తుందన్నారు. అదేవిధంగా పేదవర్గాలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇస్తామని చెప్పారు. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి రాగానే పేద మహిళల ఖాతాల్లో రూ.1లక్ష నగదు బదిలీ చేస్తామని చెప్పారు. నిరుద్యోగులకు కేంద్రంలో 30లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, కనీస మద్దతు ధర చట్టం చేస్తామని హామీ ఇచ్చారు. భువనగిరి కాంగ్రెస్ అభ్యర్థి చామలకిరణ్‌కుమార్‌రెడ్డిని, ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్నను గెలిపించాలని కోరారు.

కార్యకర్తలకు ఆపద వస్తే ఐదు నిమిషాల్లో వాలుతా : రాజగోపాల్‌రెడ్డి



నకిరేకల్: కాంగ్రెస్ కార్యకర్తలకు ఎలాంటి ఆపద వచ్చినా ఐదు నిమిషాల్లో వాలుతానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. జనసభలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ కార్యకర్తలు పట్టుదలతో పని చేసి భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. నకిరేకల్, మునుగోడు తనకు రెండు కళ్లతో సమానమన్నారు. ఒకటి పుట్టిల్లు, మరొకటి మెట్టినిల్లులా అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తానన్నారు. సూర్యాపేట, నకిరేకల్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్‌కు చెందిన పొట్టి నాయకులు ఏమాత్రం అభివృద్ధి చేయలేదన్నారు. కాంగ్రెస్‌లో గెలిచిన నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్‌కు అమ్ముడు పోయారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ చచ్చిన పార్టీ అని, ఆ పార్టీని ప్రజలు ఆదరించే పరిస్థితిలో లేరన్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికల్లో నకిరేకల్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు 65వేల మెజారిటీ వచ్చిందని, ఎంపీ ఎన్నికల్లో లక్ష మెజారిటీ రావాలన్నారు. కార్యక్రమంలో ఉప ము ఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్‌చౌదరి, ఎమ్మెల్యేలు అనిల్ కుమార్‌రెడ్డి, మందుల సామేల్, లక్ష్మారెడ్డి, జయవీర్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, నల్లగొండ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న, మాజీ ఎమ్మెల్సీలు నేతి విద్యాసాగర్, పూల రవీందర్, దైద రవీందర్, కొండేటి మల్లయ్య, చామల శ్రీనివాస్, నకిరేకల్ ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి, పి.శంబయ్య, చనగాని దయాకర్, కోట మల్లికార్జునరావు, పాల్గొన్నారు.

ఎంపీగా గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి కృషి : కిరణ్‌కుమార్‌రెడ్డి

ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్‌లో పనిచేసిన ఒక సామాన్య కార్యకర్తనైన తనకు ఎంపీగా పోటీచేసే అవకాశాన్ని కాంగ్రెస్ కల్పించిందని, సామాన్యుడైన తనను ఎంపీగా గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విన్నవించారు. ఈ ప్రాంత సమస్యలపై తనకు అవగాహన ఉందని, రాష్ట్ర ప్రభుత్వంలోని మంత్రులు, ఎమ్మెల్యేల సహకారంతో వాటన్నింటినీ పరిష్కరిస్తానని, కేంద్రం నుంచి రావాల్సిన పథకాలు, నిధులు తీసుకువస్తానని హా మీ ఇచ్చారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో మాదిరిగానే తనను ఈ ఎన్నికల్లో ఆశీర్వదించి ఎంపీగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే

సంక్షేమ ఫలాలు

- సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి


కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న జానారెడ్డి

నిడమనూరు,మే 10: కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి అన్నారు. మండలంలోని శాఖాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచులు ఇరుగుల వెంకట్‌రెడ్డి, బొజ్జ పరిమళ లాజర్, చిన్నాల సుజాత, మాజీ ఎంపీటీసీ బజారయ్య సహా 100 కుటుంబాలు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి మాజీ సర్పంచ్ చేకూరి వంశీ ఆధ్వర్యంలో జానారెడ్డి సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్‌లో చేరాయి. వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి జానారెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించడమే లక్ష్యంగా కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించిన మాదిరిగానే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్‌తోపాటు బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ కాంగ్రెస్‌కు అండగా నిలవాలని కోరారు. చేకూరి సుధాకర్, అశోక్, కొండలు, ఆశీర్వాదం, గంట శ్రీను, ఏసు, వెంకటేశ్వర్లు పార్టీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు రంగశాయిరెడ్డి, మేరెడ్డి వెంకట్‌రాహుల్, మండల పార్టీ అధ్యక్షుడు అంకతి సత్యం, చినవీరయ్య, ఈశ్వర్‌రెడ్డి, జాషువా తదితరులు ఉన్నారు.

'పట్టభద్రుల' నామినేషన్లలో


ఆరు తిరస్కరణ

- ముగిసిన ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నామినేషన్ల పరిశీలన
- 13వ తేదీ వరకు ఉపసంహరణకు గడువు

●9లో..

పోలింగ్‌కు సర్వం సిద్ధం

- పోలింగ్‌కు ముందు 48గంటలు సైలెంట్ పీరియడ్



హోరాహోరీగా సాగిన లోక్‌సభ ఎన్నికల ప్రచారం చివరి దశకు చేరింది. శనివారం సాయంత్రంతో ప్రచార గడువు ముగియనుంది. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు, వారి తరపున స్టార్ క్యాంపెయినర్లు ప్రచారాన్ని హోరెత్తించారు. ఉమ్మడి జిల్లాలోని నల్లగొండ, భువనగిరి లోక్‌సభ స్థానాల పరిధిలో ప్రధాన సమస్యలను ప్రచారంలో తెరమీదకు తెచ్చారు. ప్రచార సరళిలోనూ ఈసారి స్పష్టంగా మార్పు కనిపించింది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

నేటి సాయంత్రంతో

ప్రచారానికి తెర

- హోరాహోరీగా సాగిన లోక్‌సభ ఎన్నికల ప్రచారం
- ఉమ్మడి జిల్లాను చుట్టేసిన కీలకనేతలు

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓటర్లకు చేరువయ్యేందుకే అన్ని పార్టీల నాయకులు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. బహిరంగ సభలను తగ్గించిన పార్టీలు కార్నర్ మీటింగ్‌లు, రోడ్‌షోల ద్వారా ప్రచారాన్ని హోరెత్తించాయి. స్టార్ క్యాంపెయినర్లు సైతం సమ్మేళనాలు, రోడ్‌షోలకే ప్రాధాన్యమిచ్చి ప్రచారం నిర్వహించడం ఈసారి మారిన సరళికి నిదర్శనం. వీటికి తోడు పార్టీల మ్యానిఫెస్టోలు, నినాదాలు, లోకల్ మ్యానిఫెస్టోలతో పాటు ప్రధాని మొదలు సీఎం, మాజీ సీఎం, ఆయా పార్టీల స్టార్ క్యాంపెయినర్ల సంభాషణల వీడియోలను సోషల్‌మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయించారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్, వాట్సప్ గ్రూప్‌ల ద్వారా తమ వాణిని అభ్యర్థులు విస్తృతంగా ఓటర్ల దరికి చేర్చారు. ఓటర్లను అభ్యర్థిస్తూ వాయిస్ మెసేజెస్ ముంచెత్తాయి.

ఉమ్మడి జిల్లాలో కీలక నేతల ప్రచారం

ఉమ్మడి జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో అన్ని పార్టీల కీలక నేతలు ప్రచారం సాగించారు. కాంగ్రెస్ అభ్యర్థుల తరుపున ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నకిరేకల్‌లో జనజాతర సభలో పాల్గొనగా, భువనగిరిలో ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్యేలు ప్రచారం సాగించారు. బీఆర్ఎస్ అభ్యర్థుల కోసం మాజీ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావు రెండు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లు నిర్వహించారు. ఆయనతో పాటు మాజీ మంత్రులు హరీష్‌రావు, గుంటకండ్ల జగదీష్‌రెడ్డి విస్తృతంగా ప్రచారం సాగించారు. బీజేపీ అభ్యర్థుల కోసం కేంద్ర మంత్రులు అమిత్‌షా, జయశంకర్, కిరణ్‌రిజిజు, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, రాజస్థాన్ రాష్ట్ర సీఎం భజన్ లాల్‌శర్మ తదితర జాతీయ నాయకులతో పాటు రాష్ట్ర ఇన్‌చార్జిలు,పార్టీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ ప్రచారంలో పా ల్గొన్నారు. జాతీయ నేతలు ప్రచారానికి రావడంతో ఉమ్మడి జిల్లాలో సందడి నెలకొంది.

ముందుండి నడిపిన మంత్రులు, మాజీ మంత్రులు

ఉమ్మడి జిల్లాలో రెండు స్థానాలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న మూడు పార్టీల కీలక నేతలు అంతా తామై ప్రచార బాధ్యతలు నిర్వర్తించారు. ఈ నేతలు ఉమ్మడి జిల్లాపై తమ మార్కు చాటేందుకు శతవిధాలా ప్రయత్నించారు. నల్లగొండ కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి తరపున మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి అంతా తామై వ్యవహరించారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి కూడా కావడంతో ప్రచార పర్యవేక్షణతో పాటు మిగిలిన నియోజకవర్గాల నాయకులను సమన్వయం చేస్తున్నారు. రఘువీర్‌కు రికార్డు మెజార్టీ తేవడమే లక్ష్యంగా నిర్దేశించుకున్న మంత్రులిద్దరూ అందుకోసం తెర వెనక మంత్రాంగం ఉధృతంగా సాగిస్తున్నారు. మిత్రపక్షాలైన సీపీఎం, సీపీఐని కలుపుకొనిపోవడంతో పాటు ప్రతీ అసెంబ్లీ పరిధిలో సమన్వయ సమావేశాలు నిర్వహించారు. మరోవైపున మాజీమంత్రి కుందూరు జానారెడ్డి తన కుమారుడికి రికార్డు మెజార్టీ సాధించడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ ప్రచార సారథిగా, కాంగ్రెస్ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపు బాధ్యతలు తీసుకున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సారథ్యంలో నియోజకవర్గంలో ప్రచారం కొనసాగింది. బీఆర్ఎస్‌లో అభ్యర్థుల ఎంపిక మొదలు ప్రచారం వరకు మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి అంతా తానై వ్యవహరించారు. అభ్యర్థులకు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకుల మధ్య సమన్వయం చేయడంతో పాటు, ప్రచార ఎజెండాను ఆయన ఖరారు చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమన్వయం చేయడంతో పాటు, నిత్యం విస్తృతంగా ప్రచారంలో పాల్గొన్నారు. ప్రత్యర్థులపై తనదైన శైలిలో విమర్శనాస్త్రాలు సంధిస్తూ పార్టీ శ్రేణుల్లో జోష్ నింపే ప్రయత్నం చేశారు. బీజేపీ భువనగిరి స్థానాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో పార్టీ ముఖ్యనేతలు అక్కడ మకాం వేసి ప్రచారం చేస్తున్నారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, పాపారావు ప్రచారాన్ని పర్యవేక్షించారు.

ప్రధాన సమస్యలే ప్రచారాస్త్రాలు

ఉమ్మడి జిల్లాలో నెలకొన్న ప్రధాన సమస్యలే ఈ ఎన్నికల్లోనూ అభ్యర్థులకు ప్రచారాస్త్రాలుగా మారాయి. ప్రధానంగా నేతలంతా రీజినల్ రింగురోడ్డు, మూసీ పునరుద్ధరణ, కొత్త రైల్వే లైన్లు, ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం పూర్తి, డిండి ఎత్తిపోతల, ఎయిమ్స్ ఆస్పత్రి, డ్రైపోర్టుల ఏర్పాటు, ఇండస్ట్రియల్ కారిడార్ తదితర సమస్యలే ప్రధానంగా చర్చకు వచ్చాయి. వీటితో పాటు జాతీయస్థాయిలో రచ్చకు దారితీసిన రిజర్వేషన్ల రద్దు, రాజ్యాంగం రద్దు అంశాలతో పాటు కులగణన, నిరుద్యోగ అంశాలు ఎక్కువగా ప్రచారంలోకి వచ్చాయి. అభ్యర్థులతో పాటు కీలక నేతలంతా ఈ అంశాలనే ప్రస్తావించడంతో ఓటర్లు ఏ మేరకు ఏ అంశానికి ప్రభావితమయ్యారనేది తేలాల్సి ఉంది.

బీజేపీ వ్యూహం బెడిసికొట్టేనా?

నల్లగొండలో కాషాయజెండా ఎగరవేయాలన్న బీజేపీ లక్ష్యం ఈ ఎన్నికల్లో నెరవేరేందుకు సరైన ప్రయత్నం చేయలేదనే అంశం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. పార్టీ ఈ నియోజకవర్గంలో చేసిన ప్రయోగం సఫలం కాలేదనే వాదన తెరమీదకు వస్తోంది. పార్టీలో సుదీర్ఘకాలంగా ఉన్ననేతలను కాదని, జనాదరణ, ఇతర పార్టీల నుంచి గెలిచిన ట్రాక్ రికార్డు ఉన్న నేతలకు పార్టీలో అవకాశమిస్తే గెలుపునకు దగ్గరదారి ఏర్పడుతుందనే పార్టీ ముఖ్యుల సూత్రీకరణ ఇక్కడ తప్పిందని చెబుతున్నారు. నియోజకవర్గంలో పార్టీలో వ్యతిరేకత వచ్చినా బీఆర్ఎస్ నేత, హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డిని పార్టీలో చేర్చుకొని ఎంపీగా పోటీకి దింపారు. సైదిరెడ్డిని అభ్యర్థిగా దింపడం ద్వారా ఇక్కడ పార్టీ ఆశించిన చేరికలు జరగలేదని, బీఆర్ఎస్ ఓటు బ్యాంక్‌ని ఆకర్షించే ప్రయత్నాలూ అంతగా ఫలించలేదని, వెరసి మోదీ మేనియా తప్ప కొత్తగా వచ్చిందేమీ లేదని పార్టీశ్రేణులు పెదవి విరుస్తున్నాయి. అభ్యర్థి దూకుడుగా వెళ్లలేదని, అదే సమయంలో ప్రజల్లోకి మోదీ విధానాలను సైతం బలంగా ప్రచారం చేయలేకపోయారని విమర్శలు వస్తున్నాయి. వీటితో పాటు పార్టీలో పాతనాయకులను, సీనియర్లను సమన్వయం చేసుకోలేదని చెబుతున్నారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

- పోలింగ్ సామగ్రి కట్టుదిట్ట భద్రత నడుమ తరలించాలి
- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్

●9లో..

ప్రజలు మరోసారి

మోసపోవద్దు

- మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి


రోడ్‌షోలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, పక్కన ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి

దేవరకొండ,మే 10: బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మాయమాటలు నమ్మి ప్రజలు మరోసారి మోసపోవద్దని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి దేవరకొండ మీనాక్షిసెంటర్‌లో నిర్వహించిన రోడ్‌షోలో బీఆర్ఎస్ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, తిప్పన విజయసింహారెడ్డిలతో కలిసి పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ నుంచి కొంతమంది నాయకులు స్వార్థం కోసం కాంగ్రెస్‌లోకి వెళ్లారే తప్ప కార్యకర్తలు, ప్రజలు బీఆర్ఎస్ వెంటే ఉన్నారన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కుమ్మక్కయ్యాయని ఆరోపించారు.బీజేపీ, కాంగ్రెస్ నేతల మాటలు నమ్మవద్దన్నారు. రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జానారెడ్డిలు కేసులు పెట్టి బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రైతులకు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ మోసం చేసిందని, మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామన్న హామీ ఏమైందన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోకి వెళ్లిందని, బీజేపీ ప్రభుత్వం గోదావరి నీళ్లను తమిళనాడుకు తరలించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. కేసీఆర్ పాలనే తెలంగాణకు శ్రీరామరక్ష అని, ఆయన ప్రవేశపెట్టిన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యుత్ కోతలు, తాగునీటి సమస్య, కరువు పరిస్థితులు నెలకొన్నాయన్నారు. నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. బీఆర్ఎస్ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఎస్ఎల్‌బీసీ, నక్కలగండి ప్రాజెక్టులను పూర్తిచేసి కేసీఆర్ సహకారంతో అభివృద్ధి చేస్తానన్నారు. కాంగ్రెస్, బీజేపీ నేతల మాయమాటలు నమ్మవద్దని, రైతు కుటుంబానికి చెందిన తనను ఎంపీగా గెలిపించి ఆదరించాలన్నారు. దేవరకొండ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కృష్ణారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, విజయ్‌కుమార్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వడ్త్య రమేష్‌నాయక్, కేతావత్ బిల్యానాయక్, నేనావత్ కిషన్‌నాయక్, గాజుల ఆంజనేయులు, అంజిగౌడ్, నారాయణరెడ్డి, సుభాష్, రాజు, కృష్ణ, కేసాని లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భార్యపై హత్యాయత్నం

● సూర్యాపేట జిల్లాలో ఘటన

నాగారం, మే 10: భార్యపై అనుమానంతో భర్త భార్యపై కర్రతో దాడి చేసి హత్యాయత్నం చేశాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా నాగారం సమీపంలో జరిగింది. నాగారం ఎస్ఐ పి. వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి మండలం మాలిపురం గ్రామానికి చెందిన పోతరాజు సుధాకర్ తన భార్య మంగమ్మపై అనుమానంతో తరుచూ గొడవ పడుతున్నాడు. గొడవ తీవ్రం కావడంతో భార్య తల్లిగారి ఇంటికి వెళ్లింది. గురువారం మాలిపురం గ్రామానికి చెందిన పోతరాజు ముత్యాలుతో కలిసి తన భార్య మంగమ్మ సుర్యాపేటకు వెళుతున్నారని గమనించిన సుధాకర్ తిరుమలగి నుంచి వారిని వెంబడించి నాగారం వద్ద ఇద్దరినీ పట్టుకుని భార్యను కర్రతో తలపై కొట్టడడంతో తీవ్రంగా గాయపడింది. ఆమెను చికిత్స నిమిత్తం సుర్యాపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోతరాజు సుధాకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వైభవంగా ఆండాళ్ ఊంజల్ సేవ

భువనగిరి అర్బన్, మే 10: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో స్వామికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆగమశాస్త్ర రీతిలో వేడుకలు నిర్వహించి న పూజారులు వేకువజామున సుప్రభాత సేవతో స్వయంభువులను మే ల్కొలిపి పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీదళాలు, కుంకుమతో అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. అనుబంధ శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి వారికి నిత్య పూజలు, యాగశాలలో చండీ హోమం శైవగవ పద్ధతిలో నిర్వహించారు. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారికి పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి సేవలో తీర్చి దిద్దారు. అమ్మవారి సేవను ఆలయ తిరువీధుల్లో ఊరేగించిన అర్చకస్వాములు ప్రాకార మండపంలోని అద్దాల మండపంలో ఊయలలో అధిష్ఠింపజేశారు. అర్చకుల వేద మంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసులతో మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల మధ్య ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా కొనసాగింది. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.23,58,348ల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.



ప్రధానాలయంలో ఆండాళ్ అమ్మవారికి ఊంజలీ సేవ నిర్వహిస్తున్న అర్చకులు



ప్రధానాలయంలో తోళక్కంలో పాల్గొన్న పూజారులు

యాదగిరీశుని సన్నిధిలో తిరునక్షత్ర తోళక్కం

భువనగిరి అర్బన్: యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం తిరునక్షత్రం తోళక్కంతో ప్రారంభించారు. అత్యంత వైభవంగా నిర్వహించిన ఈ వేడుకల్లో మంగళవాయిద్యాలు అర్చకులు వేదపారాయణాలతో జగదాచార్య భగవద్రామానుజుల తిరునక్షత్రం తళోక్కం నిర్వహించారు. ఈ నెల 12 వరకు నిర్వహించే కార్యక్రమంలో ప్రధానార్చకుడు నల్లందీఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, ఉప ప్రధానార్చకుడు కాందూరి వెంకటాచార్యులు, అర్చకులు, ఆలయ అధ్యాపక, ఆరు ప్రబంధ పారాయణదారులు పాల్గొన్నారు.

కిలోన్నర నకిలీ బంగారంతో రూ.56లక్షల రుణం

- బీఎస్ఐ కేడీఎం, హాల్‌మార్క్ ముద్రలు వేసి అప్పగింత
- సంవత్సరం తర్వాత బ్యాంకు ఆడిట్‌లో వెలుగులోకి
- మూడు లేయర్లు బంగారం పూత పూసిన వైనం
- సూర్యాపేట జిల్లా గరిడేపల్లిలో ఘటన



సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం రాయినిగూడెం గ్రామంలోని బ్యాంకు ఆఫ్ బరోడా బ్రాంచి

గరిడేపల్లి, మే 10: నకిలీ బంగారాన్ని బ్యాంకులో కుదువపెట్టిన ఓ ఖాతాదారుడు రూ.56లక్షల రుణం తీసుకున్నాడు. బీఎస్ఐ కేడీఎం, హాల్ మార్క్ ముద్రలు వేసి మూడు లేయర్లు బంగారం పూత పూసిన వైనం ఏడాది తర్వాత ఆడిట్‌లో వెలుగులోకి వచ్చింది. దీంతో బ్యాంకు అధికారులు మోసం చేసిన యువకుడిని పట్టుకునే పనిలో పడ్డారు. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం రాయినిగూడెం గ్రామంలోని బ్యాంకు ఆఫ్ బరోడా శాఖ పరిధిలో ఈ సంఘటన జరిగింది. నేరేడుచర్ల మండలం వైకుంఠపురానికి చెందిన కేశవరపు రాజేష్ తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలుగా పనిచేస్తున్నారు. ఊళ్లో పెద్దమొత్తంలో అప్పులు చేయడంతో స్థానికులు నిలదీశారు. దీంతో నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని ఓ బంగారు నగల దుకాణంలో పనిచేశాడు. అనంతరం మిర్యాలగూడ పట్టణంలో సొంతంగా దుకాణం పెట్టి వ్యాపారం చేశాడు. ఇత్తడి వస్తువులకు బంగారం పూత పూయడం నేర్చుకున్నాడు. రాయినిగూడెం గ్రామంలోని బ్యాంకు ఆఫ్ బరోడా శాఖలో ఖాతా తెరిచి బంగారు పూత పూసిన ఆభరణలతో గత ఏడాది మే నెలలో రుణం తీసుకున్నాడు. అనంతరం బంధువులు, స్నేహితుల పేరిట జూన్, జూలై, ఆగస్టు, ఈ ఏడాది ఫిబ్రవరిలో విడతల వారీగా మొత్తం ఏడుగురితో కలిసి కిలోన్నర బంగారాన్ని కుదువ పెట్టి రూ.56 లక్షలు రుణం తీసుకున్నాడు. తాజాగా బ్యాంకు ఆడిటింగ్‌లో బంగారు ఆభరణాలు తూకం వేయడంతో తేడా వచ్చింది. దీంతో అధికారులు అనుమానం వచ్చి ఆభరణాల నాణ్యత పరిశీలించగా, అసలు విషయం బయట పడింది. నకిలీ వస్తువులపై మూడు లేయర్లు బంగారం పూత పూసి వాటిపై నిజమైన బంగారం ఆభరణాలపై ఉండే బీఎస్ఐ కేడీఎం, హాల్‌మార్క్ ముద్రలు కూడా ఉండడంతో బంగారం తనిఖీ చేసే వ్యక్తి కూడా గుర్తించలేకపోయినట్లు తెలిసింది. ఎవరి ప్రమేయం లేకుండా బ్యాంకులో ఇంత పెద్దమొత్తం స్వాహా చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత ఏడాది బ్యాంకు మేనేజర్‌గా పనిచేసిన శంకర్ బదిలీపై వెళ్లగా, నాలుగు నెలలుగా శ్రీకాంత్ ఇక్కడ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

మహిళల వద్ద ఆభరణాలు తీసుకుని మోసం

వైకుంఠపురం గ్రామంలో కూడా కొందరు మహిళలను మభ్యపెట్టి ఆభరణాలు తయారుచేస్తానని కేశవరపు రాజేష్ సుమారు రూ.30లక్షల విలువైన బంగారు ఆభరణాలు తీసుకుని మోసం చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. ఎంతకూ తమ ఆభరణాలు ఇవ్వకపోవడంతో వారు నిలదీయగా, రాజేష్‌కు ఉన్న 30గుంటల భూమిని బాధితులకు ఇచ్చే విధంగా గ్రామంలోని పెద్ద మనుషుల సమక్షంలో అగ్రిమెంట్ చేసినట్లు తెలిసింది. రాజేష్‌కు రెండు నెలల క్రితం మేనమామ కుమార్తెతో వివాహంకాగా, వైకుంఠపురంలో నివాసం ఉంటున్నాడు. కొద్దిరోజుల వరకు గ్రామంలో ఉన్న రాజేష్ నకిలీ బంగారంతో రుణం తీసుకున్న విషయం బయటపడడంతో పరారీలో ఉన్నాడు. బంగారం దుకాణంలో పనిచేసిన రాజేష్ విలాసాలకు అలవాటు పడి మోసాలకు పాల్పడుతున్నట్లు సమాచారం. గ్రామంలో కూడా రాజేష్‌పై గ్రామస్థులు అనేక ఫిర్యాదులు చేశారు. బ్యాంకు మేనేజర్ శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఈట సైదులు తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో 40 డిగ్రీల లోపే ఉష్ణోగ్రతలు

నల్లగొండ, మే 10: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎండలు తగ్గుముఖం పడుతున్నాయి. ఎండల తీవ్రత తగ్గడంతో జన సంచారం సాధారణంగానే ఉంది. ఎండలు తగ్గుముఖం పట్టడడంతో వివిధ పార్టీల నాయకులు సమావేశాల కోసం భారీగానే జనాన్ని సమీకరిస్తున్నారు. ఇళ్లలో ఏసీలు, కూలర్ల వినియోగం తగ్గింది. కొన్ని రోజుల క్రితం ఎండలు ఎక్కువగా ఉండడంతో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ సందర్శనకు వచ్చే భక్తుల సంఖ్య ముఖం పట్టినా ప్రస్తుతం తగ్గడంతో భక్తులు ఆలయానికి భారీగానే తరలిస్తున్నారు. నల్లగొండ జిల్లా వేములపల్లిలో 41.9డిగ్రీలు, చింతపల్లిలో అత్యల్పంగా 35.9డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సూర్యాపేట జిల్లా మట్టంపల్లి మండలం పెద్దవీడు గ్రామంలో అత్యధికంగా 40.8 డిగ్రీలు, నాగారం మండలంలో అత్యల్పంగా 37.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అదేవిధంగా యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలంలోని జనగామ గ్రామంలో అత్యధికంగా 39.9 డిగ్రీలు, ఆలేరు మండలంలోని శారాజీపేట గ్రామంలో అత్యల్పంగా 36.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నాలుగు రోజులుగా ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. ఇటీవల కురిసిన అకాల వర్షంతో వాతావరణంలో మార్పులు వచ్చాయి.

వడదెబ్బతో కూలీ మృతి

రామన్నపేట: యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేటలో వడదెబ్బతో కూలీ మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. రామన్నపేటకు చెందిన గట్టు రాములు(69) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. రాములు మూడు రోజుల క్రితం అస్వస్థతకు గురికాగా కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం రామన్నపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాములు మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. రాములుకు ఇద్దరు కుమార్తెలు, ముగ్గురు కుమారులు ఉన్నారు. రాములు భార్య గతంలోనే మృతిచెందింది.

ఘన చరిత్ర గల తొండ ఆలయాలు

తిరుమలగిరి రూరల్, మే 10: తొండ గ్రామంలోని శిథిలావస్థలో ఉన్న ఆలయాలకు ఘన చరిత్ర ఉందని తమ పరిశీలనలో తేలిందని పురావస్తుశాఖ నల్లగొండ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ మల్లునాయక్ అన్నారు. మండలంలోని తొండ గ్రామ శ్రీరామ కమిటీ సభ్యులు వారం రోజుల క్రితం గ్రామంలోని శిథిలావస్థలో ఉన్న ఆలయాలను పరిశీలించిన సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలోని వినాయక, నంది, సూర్యుడి, సప్త మాత్రికుడు భైరవ విగ్రహాలను శివలింగంను చూస్తే కాకతీయుల పరిపాలనలో భాగంగా 1289- 1329 ప్రతాపరుద్రుని కాలం నాటివని తెలుస్తున్నోందన్నారు. గ్రామంలోని శాసనాల గురించి పై అధికారులకు తెలియజేశామన్నారు. ఇలాంటి ఘన చరిత్ర కలిగిన ఆలయాల గురించి ప్రజలు తెలుసుకోవడం మంచిదన్నారు. ఈ ఆలయంలోని రాళ్ళపై లిఖించబడిన లిపిని అధ్యయనం చేసి ప్రజలకు తెలియపరుస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు వెంకన్న, లక్ష్మయ్య, ప్రవీణ్, రామక్రిష్ణ, వెంకన్న, ఉపేందర్, రవీందర్, ఏసిరెడ్డి, రవి, వెంకటయ్య, భిక్షపతి, శ్రీను, సైదులు తదితరులు పాల్గొన్నారు.



తొండ గ్రామ ఆలయంలోని విగ్రహాలను పరిశీలిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్

57 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నార్కట్‌పల్లి, మే 10: అక్రమంగా తరలిస్తున్న 57 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్ఐ అంతిరెడ్డి తెలిపారు. వాహ నాల తనిఖీల్లో చేపడుతుండగా బియ్యాన్ని పట్టుకొని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నల్లగొండకు చెందిన ప్రసాద్ నల్లగొండ పట్టణం నుంచి డీసీఎం వాహనంలో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నాడు. మండలంలోని గోపలాయపల్లి ఆర్చి వద్ద వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా వాహనంలో 57 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అంతిరెడ్డి తెలిపారు.

వలిగొండ: అక్రమంగా నిల్వచేసిన పీడీఎస్ బియ్యంను శుక్రవారం పోలీసులు పట్టివేశారు. ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి అక్రమంగా పీడీఎస్ బియ్యంను నిల్వచేసినట్లు విశ్వసనీయ సమాచారం మేకు అతని ఇంటిని తనిఖీ చేయగా సుమారు 5 క్వీటాల బియ్యంను గుర్తించారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసునట్లు ఎస్ఐ తెలిపారు.



నార్కట్‌పల్లిలో రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్న ఎస్ఐ

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

తిప్పర్తి మండలంలో ఘటన



నాగయ్య

తిప్పర్తి, మే 10: నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం చిన్నసూరారం గ్రామంలో అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్ఐ రామ్మూర్తి, స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నారగోని నాగయ్య (37) తనకున్న ఎకరంన్నర భూమితోపాటు మూడు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేశాడు. వేసవిలో భూగర్భజలాలు తగ్గి బోర్లు సరిగ్గా పోయకపోవడంతో వరిపొలం పూర్తిగా ఎండిపోయింది. ఈ క్రమంలో పొలాన్ని కాపాడుకోవాలన్న తపనతో నాగయ్య వారం రోజుల క్రితం మరో బోరు వేశాడు. ఆ బోరులో కూడా సరిపడా రాలేదు. దీనికి తోడు ఆరు నెలల క్రితం సుమారు రూ.20లక్షలు అప్పు చేసి కొత్తగా ఇంటి నిర్మాణం చేపట్టాడు. ఈ క్రమంలో అప్పులు ఎక్కువయ్యాయి. పంటను కాపాడుకోవడంకోసం, బోర్లకు మరో రూ.4లక్షలు అప్పులు చేశాడు. దీంతో మొత్తం రూ.24లక్షలు అప్పులు ఎలా తీర్చాలో అర్థంకాక ఆందోళన చెందిన రైతు ఈ నెల 9వ తేదిన సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన నాగయ్య భార్య సురంభ స్థానికుల సాయంతో నకిరేకల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

అక్కడ పరిస్థితి విషమించడంతో నల్లగొండలోని మరో ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య సురంభ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తిప్పర్తి ఏఎస్ఐ రామ్మూర్తి తెలిపారు. నాగయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

● రాష్ట్రఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్, పాల్గొన్న కలెక్టర్ జండగె

భువనగిరి అర్బన్, మే 10: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అధికారులకు సూచించారు. ఈ నెల 13న జరిగే పోలింగ్‌కు సంబంధించి పోస్టల్ బ్యాలెట్, ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ, రిసెప్షన్ కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఈవీఎం యంత్రాల తరలింపు, లెక్కింపు ఏర్పాట్లు తదితర అంశాలపై సూచనలు చేస్తూ హైదరాబాద్‌నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. పోలింగ్ సామగ్రిని పంపిణీ చేసేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఒకవేళ వర్షాలు కురిస్తే ఈవీఎంలు, ఇతర పోలింగ్ సామగ్రి తడిసిపోకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలింగ్ మరికొద్ది గంటల వ్యవధి మాత్రమే మిగిలి ఉన్న నేపథ్యంలో నగదు, మద్యం, విలువైన వస్తువుల పంపిణీ వంటి వాటిపై గట్టి నిఘా పెట్టాలని, ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించాలని, చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. మాక్‌పోల్, పోలింగ్ ప్రక్రియల సందర్భంగా ఈవీఎంలలో సాంకేతిక సమస్యలు తలెత్తితే ఈసీ మార్గదర్శకాలను పాటించాలన్నారు. ప్రతీ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో ఇంజనీర్లు అందుబాటులో ఉంటారని, సెక్టోరల్ అధికారులు వారిని సంప్రదించేలా చూడాలన్నారు. నిర్ధేశిత సమయానికి పోలింగ్ ప్రారంభమయ్యేలా ప్రణాళికబద్ధంగా వ్యవహరించాలన్నారు. పోలింగ్ తర్వాత కేంద్రాల నుంచి లెక్కింపు కేంద్రం వద్ద స్ట్రాంగ్ రూంకు ఈవీఎంలు పోలీస్ బందోబస్తు మధ్య తరలించాలన్నారు. సెక్టోరల్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. పోలింగ్ సిబ్బంది సకాలంలో పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌క్యాస్టింగ్ నిర్వహించాలని, కంట్రోల్ రూం ద్వారా పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో, కలెక్టర్ హనుమంతు కే.జెండగే, రెవెన్యూ అదనపు కలెక్టర్ పి.బెన్ షాలోమ్, భువనగిరి ఆర్డీవో పి.అమరేందర్, శేఖర్‌రెడ్డి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎం.నాగేశ్వరచారి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

● ఎన్నికల పోలీస్ పరిశీలకుడు నవీన్‌షైనీ


గూడూరు చెక్‌పోస్టు వద్ద రికార్డులు పరిశీలిస్తున్న నవీన్‌షైనీ

భువనగిరి అర్బన్, బీబీనగర్, మే 10: ఎన్నికల నిబంధనలు అతిక్రమించిన ఎంతటి వారిపైనైనా చర్యలు తీసుకుంటామని ఎన్నికల పోలీస్ పరిశీలకుడు నవీన్‌షైనీ హెచ్చరించారు. జిల్లాలో శుక్రవారం భువనగిరి లోక్‌సభ పరిధిలోని భువనగిరి, మునుగోడు, నకిరేకల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లోని పలు చెక్‌పోస్టుల్లో తనిఖీలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతీ వాహనాన్ని తనిఖీ చేపట్టి రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. నిబంధనల కంటే ఎక్కువ ఉన్న నగదు పరిశీలించి సీజ్ చేయాలని, డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలను పకడ్బందీగా అరికట్టాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహించాలన్నారు. కాగా, చౌటుప్పల్ మండలం పంతంగి, బీబీనగర్ మండలం గూడూరు చెక్‌పోస్టు, రాఘవపురం, భూదాన్‌పోచంపల్లి మండలం కప్రాయపల్లి, చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేట, చిట్యాల, నార్కట్‌పల్లి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలతోపాటు తూప్రాన్‌పేట, వట్టిమర్తి స్టాటిస్టికల్ సర్వైలెన్ చెక్‌పోస్టులు తనిఖీ చేపట్టారు. ఆయన వెంట ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, లైజనింగ్ అధికారి జినుకల శ్యాంసుందర్, పోలీసులు ఉన్నారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో పటిష్ఠ బందోబస్తు

నార్కట్‌పల్లి: పార్లమెంటు ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేసినట్టు ఎన్నికల పోలీస్ పరిశీలకుడు నవీన్‌షైనీ తెలిపారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను శుక్రవారం తనిఖీచేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు, బందోబస్తు గురించి స్థానిక ఎస్ఐ అంతిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమస్యాత్మ పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠ భద్రత కల్పిస్తున్నామని, ఓటర్లు నిర్భయంగా ఓటు వేయాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా స్థానిక పోలీసులతో పాటు కేంద్ర బలగాలు బందోబస్తు నిర్వహిస్తాయని తెలిపారు. ఆయన వెంట చిట్యాల ఎస్ఐ డి.సైదాబాబు ఉన్నారు.

తిమ్మారెడ్డిగూడెంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల ఘర్షణ

మునగాల, మే 10: సూర్యాపేట జిల్లా మునగాల మండలంలోని తిమ్మారెడ్డిగూడెంలో ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు ఘర్షణ పడ్డారు. ఎస్ఐ వెంకన్న శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. మొదట కాంగ్రెస్ కార్యకర్తలు ప్రచారం నిర్వహించుకొని ఆత్మీయ భోజన కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నారు. బీఆర్ఎస్ ప్రచార సమయంలో ఇద్దరు కాంగ్రెస్ కార్యకర్తలు ట్రాక్టర్లతో విన్యాసాలు చేశారు. దీంతో ఇరు వర్గాల పెద్దలు జోక్యం చేసుకొని సర్దిచెప్పారు. అనంతరం బీఆర్ఎస్ భోజన కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు ఎదురుపడి ఘర్షణ పడ్డారు. దీంతో కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. దీంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు రంగ ప్రవేశంచేసి ఇరు వర్గాలను చెదరగొట్టారు. ఘర్షణకు పాల్పడిన ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉపాధి కూలీలు ఓటు వినియోగించుకోవాలి


కూలీలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

భువనగిరి రూరల్, మే 10: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని ప్రతి ఒక్కరూ విధిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని డీఆర్‌డీవో ఎంఏ కృష్ణన్ అన్నారు. శుక్రవారం మండలంలోని తుక్కాపురంలో ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు ఎన్నికల కమిషన్ ఆదేశాలతో 2024 ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలు తప్పనిసరి తమ ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో గడ్డ బాలస్వామి, టెక్నికల్ అసిస్టెంట్ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి రాజు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి కూలీలు తదితరులు ఉన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగొద్దు

ఎస్‌పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ చక్రపాణి


సమావేశంలో మాట్లాడుతున్న చక్రపాణి

హుజూర్‌నగర్, మే 10: పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని తెలంగాణ ఎస్‌పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ చక్రపాణి కోరారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో జిల్లాస్థాయి విద్యుత్ అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. పోలింగ్ బూత్‌లలో వెలుతురు ఉండేలా నిరంతరం విద్యుత్ అందించాలన్నారు. పోలింగ్ అధికారులు సిబ్బందితో సమన్వయం చేసుకోవాలన్నారు. పోలింగ్ రోజు ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యుత్ సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. అకాల వర్షాలు, భారీ ఈదురు గాలులతో విద్యుత్ లైన్లకు నష్టం జరిగితే ఆలస్యం చేయకుండా విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. విద్యుత్ కోతలు లేవని, 24 గంటల విద్యుత్ అందించాలన్నారు. మరమ్మతుల సమయంలో ప్రజలకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ వెంకటకృష్ణయ్య, ఏడీఈలు సక్రూనాయక్, వినోద్, వెంకన్న, రాంప్రసాద్‌గౌడ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

పీవోలకు, ఏపీవోలకు రవాణా సౌకర్యం

సూర్యాపేట(కలెక్టరేట్), మే 10: పోలింగ్ విధుల అనంతరం పీవోలకు, ఏపీవోలకు వారి ప్రాంతాలకు వెళ్లేందుకు రవాణా సౌకర్యం ఏర్పాటు చేసినట్లు సూర్యాపేట జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ అన్నారు. కలెక్టరేట్‌లో స్పెషల్ అధికారులతో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 13వ తేదీ పోలింగ్ ముగిసిన తర్వాత ఇతర ప్రాంతాల నుంచి విధులకు వచ్చిన వారిని ఉచితంగా వారి ప్రాంతాలకు రవాణా సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బస్సు రూట్ తెలిసే విధంగా బస్సులపై సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఖమ్మం, నల్లగొండ జిల్లాలకు వెళ్లే ఉద్యోగులకు చార్జీలతో కూడిన రవాణా సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. రవాణాసౌకర్యాలు పరిశీలించేందుకు నలుగురు స్పెషల్ అధికారులు, నలుగురు డిప్యూటీ తహసీల్దార్లు, నలుగురు ఆర్టీసీ అధికారులను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారి రూపేందర్‌సింగ్, డీఎండబ్ల్యూ జగదీష్‌రెడ్డి, పంచాయతీరాజ్ అధికారి వెంకటేశ్వర్లు, రవాణాశాఖ అధికారి సురేష్‌రెడ్డి, డీఈవో అశోక్, మనుధన్‌రెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సూర్యాపేట జిల్లా కలెక్టర్ వెంకట్రావ్

పోలింగ్‌కు సర్వం సిద్ధం

● నేటి సాయంత్రం నుంచి ప్రచారం బంద్ ● ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దాసరి హరిచందన

నల్లగొండ, మే 10: నల్లగొండ పార్లమెంటు స్థానానికి మే 13న పోలింగ్ నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 13వ తేదీన ఉదయం 7 నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. సాయంత్రం 6గంటల లోపు పోలింగ్ కేంద్ర పరిధిలోని 100మీటర్ల లోపల ఉన్న ఓటర్లకు టోకెన్లు ఇచ్చి ఓటు వేసే అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఇప్పటికే జిల్లా కేంద్రం నుంచి అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈవీఎంలను పంపించామని, ఈనెల 12న డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి ఆయా పోలింగ్ స్టేషన్‌లకు ఎన్నికల సిబ్బందితో పాటు ఈవీఎంలు చేరుకుంటాయన్నారు. అభ్యర్థులంతా ఈనెల 11వ తేదీన సాయంత్రం ప్రచారాన్ని నిలిపి వేయాలని, ప్రచారం ముగిసిన సమయం నుంచి పోలింగ్ పూర్తయ్యే వరకు మద్యంపై నియంత్రణ ఉంటుందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, యువ ఓటర్లు ప్రతీ ఒక్కరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎండలను దృష్టిలో ఉంచుకుని నీడతోపాటు తాగునీటి సౌకర్యం, దివ్యాంగ ఓటర్లకు ప్రత్యేక సదుపాయాలు కల్పించామన్నారు. దివ్యాంగ ఓటర్లను తీసుకవచ్చి, తీసుకువెళ్లేందుకు సహాయకులను ఏర్పాటు చేశామన్నారు. అంబులెన్స్‌లు కూడా అందుబాటులో ఉంటాయన్నారు. విలేకరుల సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ములుగు జిల్లా అదనపు కలెక్టర్ సీహెచ్.మహేందర్, జీఏఆర్‌వో ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డిప్యూటీ రిటర్నింగ్ ఆఫీసర్ నటరాజు, సమాచారశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ యు.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌కు ముందు 48గంటలు సైలెంట్ పీరియడ్ : ఎస్పీ

పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో పోలింగ్‌కు ముందు 48గంటలు సైలెంట్ పీరియడ్ ఉంటుందని, శనివారం సాయంత్రం 5గంటల నుంచి పోలింగ్ ముగిసే వరకు ఇది కొనసాగుతుందని ఎస్పీ చందన దీప్తి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సైలెంట్ పీరియడ్ సమయంలో రాజకీయ పార్టీలు సభలు, సమావేశాలు నిర్వహించకూడదన్నారు. జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఐదుగురి కంటే ఎక్కువ మంది గుంపుగా ఉండకూడదన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే నగదు, మద్యం, ఇతర వస్తువుల రవాణాపై మరింత పకడ్బందీగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఎవరైనా ఉచితాలు పంపిణీ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇతర ప్రాంతాలకు చెందిన వారు శనివారం సాయంత్రం 5గంటలలోపు హోటళ్లు, లాడ్జీలు, గెస్ట్‌హౌస్‌లలో ఉంటే ఖాళీ చేసి వెళ్లిపోవాలన్నారు.

ఓటరు చైతన్యం కోసం క్యాండిల్ వాక్ నేడు

ఓటరు చైతన్య కార్యక్రమంలో భాగంగా ఈనెల 11వ తేదీ రాత్రి 7 నుంచి 8గంటల వరకు క్యాండిల్ వాక్ నిర్వహిస్తున్నట్టు ఎన్నికల స్వీప్ నోడల్ అధికారి, జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల నుంచి గడియారం సెంటర్ వరకు క్యాండిల్ వాక్ నిర్వహిస్తామని, ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

'పట్టభద్రుల' నామినేషన్లలో ఆరు తిరస్కరణ

● ముగిసిన ఎమ్మెల్సీ ఉపఎన్నిక నామినేషన్ల పరిశీలన ● ఈ నెల 13వ తేదీ వరకు ఉపసంహరణకు గడువు

నల్లగొండ, మే 10: వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల శాసనమండలి ఉప ఎన్నిక నామినేషన్ల పరిశీలన అనంతరం వివిధ కారణాలతో ఆరింటిని తిరస్కరించారు. శుక్రవారం నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ దాసరి హరిచందనతోపాటు అధికారులు నామినేషన్లను పరిశీలించారు. ఈ నెల 2వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించగా, మొత్తం 84 మంది అభ్యర్థులు 117 సెట్ల నామినేషన్ పత్రాలను అందజేశారు. ఆరు నామినేషన్లను తిరస్కరించగా, 78 నామినేషన్లను ఆమోదించారు. ఈ నెల 13వ తేదీ మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చు. శని, ఆదివారాల్లో(ఈ నెల 11, 12 తేదీలు) సెలవు రోజు అయినందున నామినేషన్ ఉపసంహరణకు దరఖాస్తులు స్వీకరించరు. ఈ నెల 27వ తేదీన ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నారు. పట్టభద్రుల నియోజకవర్గం 12 జిల్లాల్లో విస్తరించి ఉండగా, 4,63,000 మంది ఓటర్లు, 605 పోలింగ్ స్టేషన్లలో తమ ఓటు హక్కును వినియోగించుకుంటారు. బ్యాలెట్ పేపర్ ద్వారా ఈ ఎన్నికను నిర్వహిస్తారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను నల్లగొండ జిల్లా కేంద్ర సమీపంలోని అనిశెట్టి దుప్పలపల్లి వద్ద ఉన్న రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోదాములోని స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరుస్తారు. జూన్ 5వ తేదీన కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించనున్నారు.

నామినేషన్ల తిరస్కరణకు గురైన అభ్యర్థులు వీరే

వరంగల్ - ఖమ్మం - నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్ల పరిశీలన అనంతరం ఆరు నామినేషన్లు తిరస్కరించారు. మొత్తం 84మంది అభ్యర్థుల్లో ఆరు నామినేషన్లు తిరస్కరించారు. ఇందులో బహుజన ముక్తి పార్టీకి చెందిన కందాలపల్లి కాశినాథ్, స్వంతంత్ర అభ్యర్థులు అల్వాల కనకరాజు, రాథోడ్ రవీందర్‌నాయక్, పున్నం సుధీర్, ఎస్. ఉపేందర్, మాదగోని వెంకటేశ్వర్ల నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. మిగతా 78 నామినేషన్లు సక్రమంగా ఉండటంతో అధికారులు ఆమోదించారు.

93.78 లీటర్ల మద్యం స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

వలిగొండ, మే 10: నిబంధనలకు విరుద్ధంగా ఆటోలో తరలిస్తున్న మద్యాన్ని యాదాద్రిభువనగిరి జిల్లా పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన ప్రవీణ్ ఆటోలో మద్యం పెట్టెళ్లను తరలిస్తుండగా పోలీసుల ఆటోను తనిఖీ చేశారు. అందులో 93.78 లీటర్ల మద్యం సీసాలు పట్టుబడ్డాయి. వాటి విలువ రూ.1,03,158 ఉంటుందని ఎస్ఐ తెలిపారు. అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి, మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. అక్రమ రవాణా పాల్పడుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మోదీ మళ్లీ గెలిస్తే దేశం సర్వనాశనం

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం


పుట్టపాకలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీరభద్రం

సంస్థాన్ నారాయణపురం, మే 10: కేంద్రంలో మోదీ మళ్లీ గెలిస్తే దేశం సర్వనాశనం అవుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. భువనగిరి సీపీఎం అభ్యర్థి ఎండీ. జహంగీర్‌కు మద్దతుగా యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని పుట్టపాక గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన బహిరంగసభలో మాట్లాడారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని విధ్వంసం చేస్తున్నారన్నారు. రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్న బీజేపీని ఈ ఎన్నికల్లో బొంద పెట్టాలన్నారు. దేశవ్యాప్తంగా 28 పార్టీలతో ఇండియా కూటమి ఏర్పాటు చేశామన్నారు. ఏటా 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోదీ హామీ ఏమైందని ప్రశ్నించారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక 20కోట్ల ఉద్యోగాలు ఊడిపోయాయని విమర్శించారు. రైతుల ఆదాయం రెండితలు చేస్తామని అధికారంలోకి వచ్చిన బీజేపీ గిట్టుబాటు ధర అడిగినందుకు ఢిల్లీలో 765 మంది రైతులను పొట్టనపెట్టుకుందన్నారు. బీజేపీ ఆగడాలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష పార్టీల నాయకులను జైళ్లకు పంపిస్తున్నారన్నారు. పేదల సంక్షేమాన్ని మరచి పెత్తందారులకు పెద్దపీట వేస్తున్నారన్నారు. దేశంలో మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్న బీజేపీకి ప్రజలు సరైన గుణపాఠం చెప్పాలన్నారు. నిరంతరం ప్రజల కోసం పనిచేస్తున్న సీపీఎం అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని తమ్మినేని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మర్రి వసంత, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు స్కైలాబ్, జిల్లా నాయకులు దోనూరి నర్సిరెడ్డి, దోడ యాదవరెడ్డి, గుంటోజు శ్రీనివాసచారి, పిట్ట రాములు, నర్సిరెడ్డి, పెద్దులు, అమరేందర్ పాల్గొన్నారు.

ప్రజలకోసం పోరాడే వారిని గెలిపించాలి : జూలకంటి

వలిగొండ: అవకాశవాద రాజకీయ పార్టీలను భువనగిరి పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించి నిరంతరం ప్రజలకోసం పోరాడే సీపీఎం అభ్యర్థి ఎండీ. జహంగీర్‌ను గెలిపించాలని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని పులిగిల్ల గ్రామంలో సీపీఎం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతూ దేశంలో గత 10 సంవత్సరాల క్రితం అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ధరలను పెంచి పేదప్రజలను నిలువు దోపిడీ చేసిందన్నారు. ఏటా 2కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ప్రగల్భాలు పలికి, ప్రజా పోరాటల ద్వారా సాధించిన ఉద్యోగాలను తొలగించిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్లకు విక్రయిస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నారీ అయిలయ్య, నాయకులు మాటూరి బాలరాజు, సిరిపంగి స్వామి, లక్ష్మారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, చంద్ర మౌళి, వెంకట్‌రెడ్డి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల ఏర్పాటు


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

మర్రిగూడ, మే 10: అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించినట్లు తహసీల్దార్ బక్క శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని ఖుదాబక్షపల్లి గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించి అక్కడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండల పరిధిలోని 18 గ్రామపంచాయతీలకు గాను 34 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. మండలంలోని 30,289 ఓటర్లు ఈ నెల 13వ తేదీన జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటును సద్వినియోగం చేసుకోనున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి అన్ని వసతులు కల్పించినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ఆర్ఐ బషీర్‌లు ఉన్నారు.

ఆర్.కృష్ణయ్యపై దాడి హేయమైన చర్య

దామరచర్ల, మిర్యాలగూడ టౌన్, మే 10: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైసీపీ తరుపున ప్రచారం చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యపై దుండగులు దాడి చేయడం హేయమైన చర్య అని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్యయాదవ్ అన్నారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్.కృష్ణయ్య 45సంవత్సరాలుగా బీసీల కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్నారని, ఆయనపై దాడి చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఇప్పటికైనా ఇలాంటి చర్యలు మానుకోవాలని లేకపోతే తగిన బుద్ధి చెబుతామని ఆయన హెచ్చరించారు. సమావేశం లో నాయకులు పోలగాని వెంకటేష్‌గౌడ్, జల్లా లింగయ్యయాదవ్, సైదులు, రవి, నాగరాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

'చేనేతలను అవహేళన చేసిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి'

గట్టుప్పల్, మే 10: చేనేత కుటుంబాలను అవహేళన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎంపీ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని చండూరు జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం పిలుపునిచ్చారు. గట్టుప్పల్ మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పద్మశాలీలు ఆలోచించాలని, ఓటు ద్వారా కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పే అవకాశం వచ్చిందని అన్నారు. త్రిఫ్ట్ ఫండ్, చేనేత మిత్ర, 60ఏళ్ల దాటిన కార్మికులకు జీవిత బీమా కొనసాగించాలని డిమాండ్ చేశారు. పార్టీలు మారిన వారిపైన విమర్శలు చేస్తున్న గట్టుప్పల్ కాంగ్రెస్ నాయకులు ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు. సమావేశంలో ఎంపీపీ అవ్వారి గీత శ్రీనివాస్, ఎంపీటీసీ చెరిపల్లి భాస్కర్‌రావు, నాయకులు పున్న కిషోర్, కర్నాటి అబ్బయ్య, మోదుగు శంకర్‌రెడ్డి, కర్నాటి వెంకటేశం, జలాలుద్దీన్, పెద్దగాని శ్రీను, జగన్, వెంకటేశం, ఆనంద్ పాల్గొన్నారు.

శ్రీవిజయలక్ష్మిదేవిగా ఎల్లమ్మ తల్లి

కనగల్, ఏప్రిల్ 10: మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారు వైశాఖమాసం రెండోరోజును పురస్కరించుకుని శుక్రవారం శ్రీ విజయలక్ష్మి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ఇష్టమైన రోజు కావటంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్య లో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో కుంకుమ అభిషేక పూజలు జరిపించి, బోన నైవేద్యాలను సమర్పించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

కాంగ్రెస్, బీజేపీలను ఓడించాలి : లింగన్న

మిర్యాలగూడ, మే 10: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలను ఓడించాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు మొండికత్తి లింగన్న అన్నారు. పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై మాట తప్పిన పార్టీలను ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. మూడు ఎస్సీ రిజర్వుడు స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ మాదిగలకు ఒక్క సీటు కూడా కేటాయించలేదని అన్నారు. బీజేపీ కేంద్రంలో పదేళ్ల పాలించినా ఎస్సీ వర్గీకరణ చేయలేదని అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని ఆయన కోరారు. సమావేశంలో నాయకులు నరేందర్, చిత్రం ఉమ, చంద్రయ్య, అవిరెండ్ల సైదులు, నకిరెకంటి కృష్ణ, బాలయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పీవీరావు ఆశయ సాధనకు కృషి చేయాలి

మిర్యాలగూడ టౌన్, మే 10: మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీరావు ఆశయ సాధనకు యువత కృషి చేయాలని ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొప్పని నగేష్ అన్నారు. పీవీరావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీల హక్కులు, సంక్షేమం కోసం ప్రాణాలర్పించిన పీవీరావు మాలల మనస్సుల్లో చిరస్థాయిగా నిలుస్తారన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మాడుగుల శ్రీనివాస్, నాయకులు బైరం నరసయ్య, తాళ్లపల్లి విజయ్, నాగటి జోసఫ్, సామా నగేష్, రవి, లతీఫ్ పాల్గొన్నారు.

గోపలాయపల్లిలో సుదర్శనహోమం

నార్కట్‌పల్లి, మే 10: మండలంలోని గోపలాయపల్లిలోని శ్రీవారిజాల వేణుగోపాలస్వామి దేవాలయంలో శుక్రవారం సుదర్శన హోమాన్ని వైభవంగా నిర్వహించారు. సుదర్శన హోమం వల్ల సకల శుభాలు కలుగుతాయని యాజ్ఞీకులు కారంపూడి కృష్ణమాచార్యులు పేర్కొన్నారు. యాగానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో అనువంశిక ధర్మకర్త కోమటిరెడ్డి మోహన్‌రెడ్డిరాజేశ్వరి దంపతులు పురోహితులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు

పెద్దఅడిశర్లపల్లి, మే 10: గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీవో అదనపు పీడీ నవీన్‌కుమార్ హెచ్చరించారు. ఉమ్మడి మండలంలోని 31గ్రామ పంచాయతీ గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులపై శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున ఎవరినీ ఆహ్వానించలేదని ఎంపీడీవో తెలిపారు. పది బృందాలతో డీఆర్‌పీలు, ఎస్ఆర్‌పీలు, వీఎస్‌లు గ్రామాల్లో పనులను తనిఖీ చేశారు. పనుల్లో అవకతవకలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఏపీడీ నవీన్‌కుమార్ మాట్లాడుతూ జాబ్‌కార్డులు కలిగిన ప్రతి ఒక్కరికీ 100 రోజుల పని కల్పించాలని అన్నారు. పని జరిగే ప్రదేశంలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి వేణుగోపాల్‌శర్మ, క్వాలిటీ అధికారి ఎండీ గౌరి, డీవీకే క్లస్టర్ ఏపీడీ బాలకృష్ణ, ఎస్ఆర్‌పీ తిరుపతి, ఎంపీడీవో చంద్రమౌళి, ఏపీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దేశ సమగ్రత కోసం కాంగ్రెస్‌కు ఓటు వేయాలి


వేములపల్లి: ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మాడ్గులపల్లి, వేములపల్లి, మే 10: దేశ సమగ్రత, రాజ్యాంగ రక్షణ కోసం పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మాడ్గులపల్లి, వేములపల్లి మండలాల్లో శుక్రవారం ఆయన ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీల్లో ఐదు గ్యారెంటీలను అమలుచేసిందని తెలిపారు. అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. బీజేపీ మతం పేరుతో ఓట్లు పొందాలని చూస్తుందని, బీజేపీకి ఓటు వేస్తే దేశంలో విద్వేషాలు పెరుగుతాయని అన్నారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకోవాలంటే ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. అనంతరం మాడ్గులపల్లి మండలం చిరుమర్తి గ్రామ మాజీసర్పంచ్ నాంపల్లి శ్రీశైలంతో పాటు పాములపాడు ఎంపీటీసీ యాతం కొంగారెడ్డితో పాటు 200 మంది బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు తమ్మడబోయిన అర్జున్, స్కైలాబ్‌నాయక్, వేములపల్లి ఎంపీపీ పుట్టల సునీత, ఎంపీటీసీ చైతన్య, నాయకులు కాంతారెడ్డి, రావు ఎల్లారెడ్డి, పుట్టల శ్రీను, నాగవెల్లి, మధు, హాజీ, శ్రీనివాస్, వినోద్, వెంకన్న, కృపయ్య పాల్గొన్నారు.

ఎస్ఎల్‌బీసీ, డిండిని పూర్తి చేసి సాగునీరు అందిస్తాం : బాలునాయక్

దేవరకొండ, కొండమల్లేపల్లి: ఎస్ఎల్‌బీసీ, డిండి, నక్కలగండి ప్రాజెక్టులను పూర్తిచేసి సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. శుక్రవారం దేవరకొండ, కొండమల్లేపల్లి మండలాల్లో నిర్వహించిన ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. దేవరకొండ పట్టణంలోని 10, 11, 12 వార్డులకు చెందిన మైనార్టీలు సర్వర్‌పాష ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి, మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఎంపీపీ దూదిపాల రేఖరెడ్డి, నాయకులు అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి, లోకసాని శ్రీధర్‌రెడ్డి, జూలూరు ధనలక్ష్మీ బాలనారాయణగౌడ్, జాన్‌యాదవ్, దేవేందర్‌నాయక్, హనుమంతు వెంకటేష్‌గౌడ్, సురేష్‌గౌడ్ పాల్గొన్నారు.

నేతన్నల సంక్షేమం కోసం కృషి : రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు: చేనేతరంగ పరిరక్షణకు, నేత కార్మికుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో పద్మశాలీ సంఘం నేతలతో కలిసి ఆయన మాట్లాడారు. చేనేతరంగ అభివృద్ధి కోసం కార్మికుల వృత్తి నైపుణ్యతను పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్న కైలాష్ నేత, ఎన్నికల ఇన్‌చార్జి నారబోయిన రవిముదిరాజ్, పార్టీ ఎన్నికల పరిశీలకురాలు సంధ్యారెడ్డి, నాయకులు గోశిక యాదగిరి, జక్కలి ఐలయ్యయాదవ్, సత్యం పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ప్రజలంతా మద్దతు ఇవ్వాలి : జైవీర్‌రెడ్డి

హాలియా: లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలంతా మద్దతిచ్చి నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డికి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. హాలియా మునిసిపాలిటీ పరిధిలోని మున్నూరుకాపు సంఘం నాయకులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డిని కలిసి తమ మద్దతును తెలిపారు. మున్నూరుకాపు సంఘం నాయకులు ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డిని సంఘం మునిసిపాలిటీ అధ్యక్షుడు గోపిశెట్టి నర్సింహ, సంఘం నేతలు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు కుందూరు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, నారాయణ, వెంకటయ్య, కొండలు, సంపతయ్య పాల్గొన్నారు.

● **అడవిదేవులపల్లి:** కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పొదిల శ్రీనివాస్, బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

● చందంపేట మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు లోకసాని మన్మథరెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు జాల నర్సింహారెడ్డి, ఎంపీపీ పార్వతీచందు నాయక్, నాయకులు బుజ్జిలచ్చిరాం, బద్యానాయక్ పాల్గొన్నారు.

● దామరచర్ల మండలంలోని కల్లెపల్లి గ్రామంలో సీపీఐ ఆధ్వర్యంలో నాయకులు ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ధీరావత్ లింగానాయక్, మాజీ సర్పంచ్ జనార్ధన్‌నాయక్, నెహ్రూనాయక్, ఎర్రనాయక్, బుజ్జి పాల్గొన్నారు.

● **మిర్యాలగూడ టౌన్:** పట్టణంలోని పలు మసీదుల వద్ద ఆ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సలీం ఆధ్వర్యంలో నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఎంఏ. ఆరీఫ్, చాంద్‌సుల్తానా, గౌస్, రఫీ, ఫెరోజ్, జుబేర్ పాల్గొన్నారు.

నల్లగొండ, నల్లగొండరూరల్: నల్లగొండ పార్లమెంటు ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డికి భారీ మెజార్టీ ఇచ్చిన గ్రామాలను మంత్రి వెంకట్‌రెడ్డి దత్తత తీసుకొని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ గుమ్ముల మోహన్‌రెడ్డి అన్నారు. నల్లగొండ మండలం కంచనపల్లి గ్రామంలో ప్రచారంలో భాగంగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఎన్నికల అనంతరం గ్రామాల అభివృద్ధి బాధ్యత తమదేనని అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, నాయకులు కొప్పు నవీన్, ఎల్లయ్య, సోములు యాదయ్య, నర్సింహ, ఈశ్వర్ పాల్గొన్నారు.


కంచనపల్లి గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న మోహన్‌రెడ్డి

అందరూ సమానమని చాటిన బసవేశ్వరుడు


బసవేశ్వరుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

నల్లగొండ, శాలిగౌరారం, మే 10: బసవేశ్వరుడు సమాజంలో కుల, వర్ణ లింగ భేదాలు లేవని అందరూ సమానమేని సుమారు 800 సంవత్సరాల క్రితమే చాటిచెప్పిన మహోన్నత వ్యక్తి అని వీరశైవలింగ బలిజ సంఘం జిల్లా అధ్యక్షుడు పొగాకు నాగరాజు అన్నారు. శుక్రవారం పట్టణంలోని బసవేశ్వర భవన్‌లో జయంతిని వీర శైవలింగ బలిజ సంఘం జిల్లా అధ్యక్షుడు పొగాకు నాగరాజు ఆధ్వర్యంలో జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైందవ మతాన్ని సంస్కరించిన ప్రముఖుల్లో బసవేశ్వరుడు ఒకరని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు ఇమ్మడి పరమేష్, ప్రధాన కార్యదర్శి కోటి, కోశాధికారి వరప్రసాద్, నాయకులు ఉప్పు శేఖర్, దొడ్డ శాంతికుమార్, మామిడి ఈశ్వరయ్య, గుండా కోటయ్య, కోయిలకొండ ఈశ్వరయ్య, మామిడి శ్రవణ్‌కుమార్, ఆనంద్, లింగప్ప, వినయ్, వీరప్ప, శ్రీశైలం, అంజయ్య, భద్రయ్య, మహేష్, శంకర్, భాస్కర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

● శాలిగౌరారం మార్కెట్ సమీపంలోని పావురాలగూడెం బస్ స్టేజీ వద్ద ఉన్న బసవేశ్వరుని విగ్రహానికి బలిజ సంఘం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గుండా దుర్గయ్య, గుండా నాగయ్య, కోటేశ్వరయ్య, గుండా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీని ఓడించాలి : సుధాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

మాడ్గులపల్లి, మే 10: దేశంలో విచ్ఛిన్న పాలన కొనసాగిస్తూ ప్రజలను మోసం చేస్తున్న బీజేపీని ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇండియా కూటమితో సీపీఎం కలిసి పనిచేస్తుందని, అందులో భాగంగానే నల్లగొండ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డికి సీపీఎం మద్దతిస్తుందని తెలిపారు. బీజేపీ అరాచక పాలనను చరమగీతం పాడాలంటే ఈ ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం చెప్పాలన్నారు. మండలంలోని పార్టీ కార్యకర్తలు సమష్టిగా పనిచేసి రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. సమావేశంలో మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని, నాయకులు అశోక్‌రెడ్డి, శ్రీకర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిక

మర్రిగూడ, మే 10: గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, గ్రామాల అభివృద్ధికి తోడ్పడ్డాయని మాజీ ఎంపీపీలు అనంత రాజుగౌడ్, మెండు మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఖుదాబక్షపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గత ప్రభుత్వం అమలు చేసిన ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. బీఆర్ఎస్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్‌యాదవ్ గెలుపు కోసం ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారిలో నాయకులు జటావత్ శ్రీను, జటావత్ పాండు, జటావత్ లచ్చా, నేనావత్ రాములు, దుద్యా, బిక్కు, పలువురు చేరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చెరుకు లింగంగౌడ్, మునగాల నారాయణరావు, పార్టీ మండల అధ్యక్షుడు శంకర్‌యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ యాదయ్య పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం


ప్రచార సభలో మాట్లాడుతున్న బూర నర్సయ్యగౌడ్

శాలిగౌరారం, చిట్యాల, కొండమల్లేపల్లి, అడవిదేవులపల్లి, మే 10: అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ అన్నారు. శుక్రవారం శాలిగౌరారంలోని నిర్వహించిన ప్రచార సభలో నర్సయ్యగౌడ్ పాల్గొని మాట్లాడారు. తాను ఉద్యమకారుడిగా, సామాజిక సేవకుడిగా, డాక్టర్‌గా అందించిన సేవలను గుర్తించి, ఆదరించి, గెలిపించాలని కోరారు. ఈ ప్రాంత ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తానన్నారు. బీజేపీకి రోజురోజుకు పెరుగుతున్న ఆదరణ చూసి కాంగ్రెస్ నాయకులకు ఓటమి భయం పట్టుకుందన్నారు. మోదీ మూడో సారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టడం ఖాయమని, హ్యాట్రిక్ సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ప్రాజెక్టుల పేరుతో రాష్ట్రాన్ని దోచుకున్న కేసీఆర్‌కు ఈ ఎన్నికలే చివరివి అన్నారు. అనంతరం బూర నర్సయ్యగౌడ్ ఆధ్వర్యంలో వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి సంకినేని రవీందర్‌రావు, నాయకులు రఘునందన్, జమ్ము రమేష్, నాయకులు గిరిగాని యాదగిరి, అల్లె రాములు, తోట వినోద్ కుమార్, అంజయ్య, సురేష్, సురేష్‌రెడ్డి, కృష్ణయ్య పాల్గొన్నారు.

● చిట్యాల మునిసిపాలిటీలో భువనగిరి ఎంపీగా బీజేపీ అభ్యర్థి నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కూరెల్ల శ్రీను, వెంకన్న, మహలింగం, ఉదయ్ పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లి, అడవిదేవులపల్లి మండలాల్లో నల్లగొండ బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు కేతావత్ లాలునాయక్, నక్క వెంకటేష్‌యాదవ్, బొడిగ సాంబశివగౌడ్, యాదగిరిగౌడ్, మల్లేష్, భరత్, రమావత్ రవీందర్, పానుగోతు కోటేష్, రాత్ల అంజి, రమావత్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

మిర్యాలగూడరూరల్, కట్టంగూరు, మునుగోడు, గుర్రంపోడు, మే 10: జిల్లాలోని వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. పాత, కొత్త నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

● మిర్యాలగూడ మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన ఎంసీపీఐ(యూ) పార్టీ, వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు వంద మంది కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గాయం ఉపేందర్‌రెడ్డి, మాజీసర్పంచ్ జొన్నలగడ్డ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. కాంగ్రెస్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. కార్యకర్తలు రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సైదులు, వెంకటయ్య, వెంకట్‌రెడ్డి, రాములు, షైబల్లి, రామచంద్రు, శేఖర్, నగేష్, కొండలు పాల్గొన్నారు.

● కట్టంగూరు మండలంలోని ఇస్మాయిల్‌పల్లి, పిట్టంపల్లి గ్రామాలకు చెందిన కొంత మంది బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మాద లింగస్వామి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో పులిగిల సైదులు, పెంజర్ల నాగరాజు, సతీష్, నిరంజన్, నవీన్, సందీప్, శ్రీను ఉన్నారు.

● మునుగోడు మండలం పలివెల ఎంపీటీసీ చెరుకు కృష్ణయ్యతో పాటు గంగోరిగూడెం, చొల్లేడు గ్రామాలకు చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు వారి అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో రవిముదిరాజ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

● గుర్రంపోడు మండలంలోని మొసంగి, జిన్నాయిచింత గ్రామాల్లోని బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ మండల అధ్యక్షుడు తగుళ్ల సర్వయ్యయాదవ్, జిల్లా నాయకులు కంచర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మొసంగి గ్రామానికి చెందిన ఎరెడ్ల వెంకట్‌రెడ్డి, గోలి దుర్గయ్య, సైదులుగౌడ్ ఆధ్వర్యంలో పేర్ల భిక్షం, పేర్ల చిరంజీవి, ఆడెపు మధు, ఏడుకొండలు, అంజయ్య, నవీన్, కాశయ్య, హరిబాబు, శ్రీనివాస్, జిన్నాయిచింత గ్రామం నుంచి భూతం తిరుపతి పార్టీలో చేరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రవికుమార్, నాయకులు జగదీశ్వర్‌రెడ్డి, చినసత్తయ్యయాదవ్, రాధాకృష్ణ పంతులు, జగదీశ్వర్‌రెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మాయ మాటలు నమ్మవద్దు : బీఆర్ఎస్

త్రిపురారం, మిర్యాలగూడ, చందంపేట, నల్లగొండ, నల్లగొండరూరల్, గట్టుప్పల్, మర్రిగూడ, మే 10: కాంగ్రెస్ పార్టీ మాయమాటలు నమ్మవద్దని, సాధ్యం కాని హామీలు ఇచ్చి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ పార్టీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి అన్నారు. త్రిపురారంలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. తనని గెలిపిస్తే పార్లమెంట్‌లో రైతుల పక్షాన తన గొంతుక వినిపిస్తానన్నారు. ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయం అనుసంధానం చేసే విధంగా పోరాటం చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీఎమ్మెల్యే నోముల భగత్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, నాయకులు కడారి అంజయ్య, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

● మిర్యాలగూడ పట్టణంలో బీఆర్ఎస్ యువనేత నల్లమోతు సిద్ధార్థ నాయకులు అన్నభీమోజు నాగార్జునాచారి, యడవెల్లి శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

● చందంపేటలోని పలు గ్రామాల్లో మాజీ జడ్పీటీసీ బోయపల్లి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జర్పుల లోక్యానాయక్, గోసుల శివ, జబ్బు శ్రీశైలం, తిరుపతయ్య, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

● నల్లగొండ పట్టణంలో మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో, నల్లగొండ మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో రావుల రేణుక, శ్యాంసుందర్, కృష్ణమాచారి, మహేందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

● గట్టుప్పల్ మండలంలో భువనగిరి పార్లమెంటు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మల్లేష్‌ను గెలిపించాలని ప్రచారం చేశారు.

● మర్రిగూడ మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో ఎంపీ అభ్యర్థి మల్లేష్ కుమార్తె ఆరోహిణి ప్రచారం నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం...

మిర్యాలగూడ టౌన్: మునిసిపల్ వర్కర్ల సేవలు ప్రశంసనీయమని చైర్మన్ తిరునగరు భార్గవ్ అన్నారు. అక్షయ తృతీయ సందర్భంగా వాసవీ, వనిత క్లబ్ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్మికులకు చీరెలు, పాదరక్షలు, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి హాజరైన భార్గవ్ మాట్లాడుతూ మహిళా క్లబ్ సభ్యులు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ నాగలక్ష్మి, నాయకులు జవహర్‌బాబు, భవాని, పద్మావతి, రమాదేవి, పుష్పవతి, రాణి తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు చిత్తశుద్ధితో పని చేయాలని డీఎం బొల్లెద్దు పాల్ కోరారు. డిపోలో నిర్వహిస్తున్న వైద్యశిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంస్థ ఎండీ ఆదేశాల మేరకు నిర్వహించిన హెల్త్ ఛాలెంజ్ కార్యక్రమంలో 415 మంది ఉద్యోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఉద్యోగులు ఆరోగ్యంగా ఉంటేనే సంస్థ అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు భారతీబాయి, యాదగిరి, వైద్యులు ప్రశాంత్, మణిదీప్, అక్షిత, గీతాంజలి, నాగ, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారం: రిజర్వేషన్లపై వివిధ పార్టీలు తప్పుడు ప్రచారం చేయడం తగదని మాదిగలంతా బీజేపీకి ఓటు వేయడం ఖాయమని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోడ సునీల్ అన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఈ పార్లమెంటు ఎన్నికల్లో మాదిగలకు, బీసీ వర్గాలకు టికెట్లు ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. 13న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేసి రేవంత్‌రెడ్డి అహంకారాన్ని తగ్గించాలన్నారు. నర్సయ్యగౌడ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రచారం చేశారు.

దేవరకొండ: దేవరకొండ మండలం పడ్మట్‌పల్లిలో బీఆర్ఎస్ నుంచి 30 కుటుంబాలు సీపీఐలో చేరినట్లు సీపీఐ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ప్రాజెక్టులకు నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. బీఆర్ఎస్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలు సీపీఐలో చేరుతున్నట్లు తెలిపారు.

చందంపేట: చందంపేట మండలం చిత్రియాల గ్రామానికి చెందిన చాట్ల కిరణ్ అనే యువకుడు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. విషయం తెలుసుకున్న పీఏసీఎస్ చైర్మన్ జాల నర్సింహారెడ్డి, జాల తిలక్‌రెడ్డి వైద్యఖర్చుల నిమిత్తం రూ.2.50 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్ కుటుంబసభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

మర్రిగూడ: భువనగిరి పార్లమెంటు సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగార్జునచారి కోరారు. మండలంలో ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న కూలీల దగ్గరకు వెళ్లి ఓటు అభ్యర్థించారు.

కనగల్: కనగల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో (కాలేజీ) ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు ఈ నెల 25వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ఇన్‌చార్జి దయాల్‌ప్రకాష్ తెలిపారు. ప్రతీ గ్రూప్‌లో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

గుర్రంపోడు: మండలంలోని పిట్టలగూడెం గ్రామంలో గల మైనార్టీ బాలుర కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పొందేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మహమ్మద్ ఫారుఖ్ తెలిపారు. కళాశాలలో ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో మొత్తం 80 సీట్లకు మైనార్టీ విద్యార్థులకు 60 సీట్లు, బీసీలకు 10 సీట్లు, ఎస్సీలకు 4, ఎస్టీలకు 4, ఓసీలకు 2 సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై ఆసక్తి కలిగిన పరిసర మండలాల విద్యార్థులు ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

తిరుమలగిరి(సాగర్): మండలంలోని నాగార్జునపేట నుంచి నాగార్జునసాగర్‌కు వెళ్లే దారిలో నిర్మాణంలో ఉన్న మారడుగు పంచముఖ హనుమాన్ ఆలయ నిర్మాణానికి నాగార్జునపేట గ్రామానికి చెందిన ప్రజారోగ్య నిపుణుడు ఆంగోతు స్వామినాయక్ జుంపాలి రూ.41వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

కనగల్: కనగల్‌లో ఉపాధి కూలీలకు బి.రాధ, గాయత్రిల సహకారంతో న్యాకంబాల శివలీల ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, ఆర్ఎంపీ శివలీల మజ్జిగను పంపిణీ చేశారు. ఎండతీవ్రత నేపథ్యంలో కూలీలు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా వారికి మజ్జిగ పంపిణీ చేసినట్లు శివలీల తెలిపారు.

గుర్రంపోడు: ఇటీవల బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన తెరాటిగూడెం మాజీ సర్పంచ్ జక్కల భాస్కర్‌కు షోకాజు నోటీస్ జారీ చేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తగుళ్ల సర్వయ్యయాదవ్ తెలిపారు. పార్టీలో క్రమశిక్షణగా ఉంటానని చెప్పి కాంగ్రెస్ పార్టీలో చేరిన జక్కల భాస్కర్ అనుచరులు గ్రామంలో వీరంగం చేశారని తెలిపారు. దీంతో భాస్కర్‌తో పాటు ఆయన అనుచరుల చేరికను హోల్డ్‌లో పెట్టినట్లు తెలిపారు. పార్టీకి నష్టం కలిగించే చర్యలు చేయడం వల్ల భాస్కర్ సంజాయిషీ కోరుతూ షోకాజు నోటీసులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదెల మృతి

చిట్యాలరూరల్, హాలియా, మే 10: విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి చెందాయి. ఈ సంఘటనలు శుక్రవారం చిట్యాల, హాలియా మండలాల్లో చోటుచేసుకున్నాయి. వివరాల్లోకి వెళితే...

● చిట్యాల మండలం నేరడ ఆవాస గ్రామమైన గాదిరెడ్డిపల్లికి చెందిన రైతు రామగిరి కృష్ణారావు పాడి గేదె రోజువారీగా గడ్డిని మేసేందుకు వ్యవసాయ పొలం సమీపంలోకి వెళ్లింది. ఇటీవల వీచిన ఈదురుగాలుల కు విద్యుత్ వైర్లు తెగి కిందపడిపోయాయి. గడ్డిని మేస్తున్న గేదె వైరు తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. పాడిగేదె విలువ రూ.60 వేలు ఉంటుందని ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

● అనుముల మండలం యాచారం గ్రామానికి చెందిన కాంచని అంజయ్య తన పాడిగేదెను గ్రామ శివారులోని వ్యవసాయ పొలంలో మేత కోసం వెళ్లింది. గేదె మేత మేస్తుండగా పొలంలో తెగిపడి ఉన్న విద్యుత్ వైర్లు తగిలి విద్యుదాఘాతానికి గురైంది. దీంతో గేదె అక్కడికక్కడే మృతి చెందింది. పాడి గేదె విలువ సుమారు రూ. 80 వేలు విలువ ఉంటుందని, ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని యజమాని అంజయ్య కోరారు.